క్లుప్తంగా

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

గుడివాడ టౌన్: వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని పురపాలకసంఘ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గొడుగులు పంపిణీ చేయడం అభినందనీయం అని జిల్లా పశు వైద్య శాఖాధికారి ఎం ఎస్ఏ దివాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక 31వ వార్డులోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు కేసీఆర్ అండ్ పీఆర్‌డీఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 మంది విద్యార్థులకు ఉచిత గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సమాజంలో ఇబ్బందిపడుతున్న వారి అవసరతలను గుర్తించి వాటిని సమకూర్చడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె. రామకృష్ణ, డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎంవీజీ ఆంజనేయులు, డి. శ్యాంబాబు, టీఎన్‌సీ సాంబశివరావు, చిన్నం గంగాధర్, ఎం. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వీల్ చైర్ వితరణ

గుడివాడ టౌన్: కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి వీల్‌చైర్ వితరణగా ఇచ్చినట్లు ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య తెలిపారు. శుక్రవారం తన భార్య వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. గత కొంతకాలంగా కె. యశోదమ్మ అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న విషయాన్ని గమనించి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రూ. 15 వేలు విలువగల వీల్ చైర్ అందించామని అది ఆమెకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పోకూరి మోహనరావు, తిరివీధి శ్రీరాములు, సాయి సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, చిట్టిబాబు, బొప్పన కుటుంబరావు, సీతారామస్వామి పాల్గొన్నారు.

విద్యాదానం అన్ని దానాల్లో కెల్లా మిన్న



మండవల్లి: విద్యాదానం అన్ని దానాల్లో మిన్న అని ఎంఈఓ-1 రామారావు పేర్కొన్నారు. మండలంలోని పెరికెగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వెన్నార్ సిరామిక్స్ కంపెనీ యాజమాన్యం సుమారు రూ.70 వేలు విలువైన నోట్ పుస్తకాలను 167 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. వెన్నార్ యాజమాన్యం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఎంఈఓ-2 రత్నసునాదం అన్నారు. గత 10 సంవత్సరాల నుంచి పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుంటున్న వెన్నార్ సిరామిక్ కంపెనీ యాజమాన్యానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రామకృష్ణ తెలిపారు.

జూనియర్ కాలేజీగా పెనమకూరు జెడ్పీ స్కూల్

తోట్లవల్లూరు: పెనమకూరు జిల్లా పరిషత్ పాఠశాల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయినట్లు మండల విద్యాశాఖాధికారి జి. వెంకటేశ్వరరావు తెలిపారు. ప్లస్ టూతో కోఎడ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ డీఈఓ తాహెరా సుల్తానా నుంచి ఆదేశాలు అందినట్లు ఆయన తెలిపారు. తరగతుల నిర్వహణపై మరింత సమాచారం రావాల్సి ఉందని వెంకటేశ్వరరావు అన్నారు. జెడ్పీ పాఠశాల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావటానికి కృషి చేసిన పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు వెంకటశివ మధుబాబు, ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మ ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా



వైఎస్సార్ సంపూర్ణ కిట్లు అందజేస్తున్న విక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకులు



కిట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ విజయ ఫ్లారెన్స్

గుడివాడరూరల్: బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. మండలంలోని లింగవరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శుక్రవారం 11మందికి కిట్లను అందజేశారు. ఈ కిట్లలో 3కిలోల బియ్యం, కేజీ పప్పు, 500గ్రాముల ఆయిల్, 25కోడిగుడ్లు, ఐదులీటర్ల పాలతో పాటు మరో ఐదు రకాలు కలిపి మొత్తం 10రకాలను కిట్ల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గద్దే వెంకట రామాంజనేయులు(రాము), మట్టా నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్త కలపాల లీల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మోటూరులో..

మండలంలోని మోటూరు సచివాలయం వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కొరగంటి పద్మ శుక్రవారం ప్రారంభించారు. బాలింతలు, గర్భిణులు 31మందికి ఈ కిట్లను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి పి.జనార్ధనరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొరగంటి పండు పాల్గొన్నారు.

మండవల్లిలో కిట్లు పంపిణీ

మండవల్లి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు గర్భిణులు, బాలింతలకు మండవల్లిలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విజయనిర్మల, సీడీపీఓ బి.ఆనంద్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అన్ని రకాల పోషక విలువలు కలిగిన 10 రకాల ఆహార పదార్థాలు కలిగిన కిట్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, సూపర్‌వైజర్ పి.కల్పవల్లి, వార్డు సభ్యులు గుడివాడ మురళీ, బొమ్మనబోయిన స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

గుడివాడ టౌన్: ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఐసీడీఎస్ సీడీపీఓ విజయ ఫ్లారెన్స్ అన్నారు. స్థానిక 12వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు బీకేడీ భవాని, ఎ జయంతి, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ కో-ఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగుంటలో..

నందివాడ మండలం పుట్టగుంట గ్రామంలో సంపూర్ణ పోషణకిట్లను గ్రామ సర్పంచ్ టి. భాస్కరరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ సాధ్యమని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలియజేశారు. మండలంలోని ఐలూరు, చాగంటిపాడు, బొడ్డపాడు, పెనమకూరు గ్రామ సచివాలయాల పరిధిలోని పాఠశాలల్లో కిశోర బాలికలకు హెచ్‌బీ పరీక్షలను ఆరోగ్య సిబ్బంది శుక్రవారం జరిపారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని కిశోర బాలికలకు కూడా రెండు రోజుల్లో రక్తపరీక్షలు పూర్తి చేస్తామని డాక్టర్ సాయిప్రసన్న తెలియజేశారు. రక్తహీనతతో అలసట, ఏకాగ్రత లేకపోవటం, చికాకు, ఆకలి లేకపోవటం, నాలుక, కనురెప్పల లోపలి భాగాలు పాలిపోయి ఉండటం, కళ్లు తిరగటం, అరచేతుల్లో చెమట పట్టడం వంటి లక్షణాలు కలుగుతాయని ఆమె చెప్పారు. రక్తహీనత నివారణకు పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ ఈఓ శ్రీధర్, పీహెచ్‌ఎన్ పద్మావతి, ఎంపీహెచ్‌ఎస్ అనిల్, ఆరోగ్య సిబ్బంది ఎస్తేరురాణి, రామానుజేశ్వరి, ప్రియాంక, రత్నశ్రీ, మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

పమిడిముక్కల: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సర్పంచ్ గొర్రెపూడి స్వర్ణలత తెలిపారు. మేడూరు సచివాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు, టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించి, టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు



మండవల్లిలో వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల



చాగంటిపాడులో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



మేడూరులో టేక్ హోమ్ రేషన్ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ స్వర్ణలత

అమ్మపాలు అమృతం...

కైకలూరు: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు అందించాలని, అమ్మపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి చెప్పారు. కైకలూరు మండలం ఆటపాక, వరహాపట్నం, రాచపట్నం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ఉప్పలపాటి నాగమణి, తలారి మణెమ్మ, అల్లూరి మంగారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరు బైపాస్ రోడ్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో కేటాయించిన రూ.20 లక్షల నిధులతో కైకలూరు బైపాస్‌రోడ్‌లో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వంలో కేటాయించిన నిధులతో రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత పాలనలో ఎప్పుడూ జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం నియోజకవర్గంలో జరిగాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, మీసాల వెంకన్నస్వామి దేవస్థాన చైర్మన్ బొప్పన శివకుమార్, కాంట్రాక్టర్ తోట మహేష్, దండే రవిప్రకాష్, బుసనబోయిన శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సహకారంతోనే సంపూర్ణ పారిశుద్ధ్యం



డ్రెయినేజీల్లో క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: పట్టణంలో మురుగునీరు ప్రవాహానికి అడ్డంకులు కలుగకుండా ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక 11వ వార్డులోని నక్కలకోడు డ్రెయిన్ పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్‌లలో నీరు నిల్వ ఉండటానికి ప్రధాన కారణం ప్రజలు వ్యర్థాలను డ్రెయిన్‌లలో వదిలివేయడమేనన్నారు. ప్రత్యేకించి ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లలో వ్యర్థాలను కట్టి డ్రెయిన్‌లలో విసిరివేయడం వల్ల అవి పెద్ద సంఖ్యలో పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు కలిగిస్తున్నాయన్నారు. కొన్ని కొన్ని ప్రాంతాలలో అధిక సంఖ్యలో వ్యర్థాలు పేరుకుపోవడం వలన వాటిని తొలగించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ బండ్లు వస్తున్నందున ప్రజలు డ్రెయిన్‌లలో వ్యర్థాలు వెయ్యడం మానుకోవాలని సూచించారు.

దేవస్థాన నిర్వహణ బాధ్యతలు బదలాయించండి



కైకలూరులో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కైకలూరు: స్థానికంగా ఉన్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం నిర్వహణ బాధ్యతలను విశ్వబ్రాహ్మణులకు బదలాయించాలని కోరుతూ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శుక్రవారం కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను ఆయన నివాసం వద్ద కలిసి వినతిపత్రాన్ని అందించారు. సంఘ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి వివరిస్తూ 1980లో వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం నిర్మించారన్నారు. తమ కులదైవమైన వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన నిర్వహణ ఇతర వ్యక్తులకు కాకుండా పూర్తిగా విశ్వబ్రాహ్మణులకే అందించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు చెప్పారు. నాయకులు సత్యనారాయణ, కోటేశ్వరరావు, అప్పలాచారి, శ్రీను, ప్రభాకరరావు, త్రినాథ్, సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం



మట్లాడుతున్న జిల్లా సలహా మండలి చైర్మన్ రాఘవరావు

కాజ(మొవ్వ): ప్రతి ఆర్‌బీకే కేంద్రంలో మొదటి శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశాలు నిర్వహించాలని, రైతు సమస్యలను తెలుసుకుని జిల్లా స్థాయికి సలహా మండలికి తెలిపితే వాటికి పరిష్కారం దొరుకుతుందని కృష్ణా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జున్ను రాఘవరావు సూచించారు. మొవ్వ మండలం కాజ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మురుగునీటి కాలువల పూడిక తీత, నీటి పారుదల కాలువలు బాగుచేయాలని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. పద్మావతి మాట్లాడుతూ ఇటీవల పడిన వర్షాలకు దెబ్బతిన్న పొలాల్లో మరలా నాటడానికి రాయితీపై విత్తనాలను అందిస్తామని, ఆర్‌బీకే అధికారులు నివేదికలు తయారు చేసి తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్. శ్యామల, ఏవో కె. శివప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గోగినేని పెరుమాళ్లు, గ్రామ సలహా మండలి సభ్యులు పి. సీతారామి రెడ్డి, ఉపసర్పంచ్ మండ శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్ల కారకులను కఠినంగా శిక్షించాలి

పామర్రు: మణిపూర్‌లో అల్లర్లకు కారకులైన వారికి కఠిన శిక్షలు పడేలా తగు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్ అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో ప్రజలపై జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా పామర్రు సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మణిపూర్‌లో అల్లర్లను చిన్నచూపు చూస్తోందన్నారు. ఈ చర్యలను యావత్ భారత దేశం ఖండించాలన్నారు. ఎన్నికల సమీపిస్తున్న సమయంలో దేశంలో ఏదో ఒక అలజడి సృష్టించి లబ్ధి పొందాలనే బీజేపీ నిర్ణయంలో భాగమే ఈ అల్లర్లకు ఆజ్యం పోసిందని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆర్ఎస్ఎస్ అడుగుజాడలలో బీజేపీ ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వేము పెదబాబు, ఐ రాజు, కెసాల్మన్‌రాజు, కె లక్ష్మణ, భాను ప్రసాద్,కోటేశ్వరరావు, డి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

నేడు నిరసన సభ

పామర్రు: మణిపూర్‌లో జరిగిన హింసా కాండకు నిరసనగా శనివారం ఉదయం 10గంటలకు స్థానిక పామర్రు సచివాలయం-1లో గ్రామ సర్పంచ్ కె. కస్తూరి అధ్యక్షతన నిరసన సభను నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కె. సాల్మన్‌రాజు శుక్రవారం తెలిపారు. క్రైస్తవులు, ముస్లింలు, గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- చినపారుపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

చినపారుపూడి(పెదపారుపూడి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండి, మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని చినపారుపూడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల వివరించి బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థను తీసుకుని వచ్చి నేరుగా ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇంతటి గొప్ప వ్యవస్థను తీసుకుని వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మీరందరూ అండగా ఉండాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలలో వస్తున్న ఆదరణ చూచి ప్రతి పక్షాలు కుట్రలతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, పెదపారుపూడి పీఏసీఎస్ బ్యాంక్ చైర్‌పర్సన్ తుమ్మల కోటేశ్వరరావు, పామర్రు మార్కెట్ యార్డు డైరక్టర్లు గోళ్ల వెంకటేశ్వరరావు, చేబ్రోలు సుజాత, సర్పంచ్‌లు ఎన్. శ్రీనివాసరావు, గోళ్ల సోమేశ్వరరావు, పాతూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, వైఎస్సార్ సీపీ నాయకులు ఆల రమేష్, చోరగుడి ఇజ్రాయేల్, విద్యాసాగర్, మొవ్వా శ్రీనివాసరావు, జాజుల నాగమలేశ్వరరావు, నమా వెంకటేశ్వరరావు, చిగురుపాటి శ్రీధర్, కాటూరి అశోక్, పంచాయతీ కార్యదర్శి సగ్గురి నరేష్, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీఓ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



కైకలూరు: ఏపీఎన్జీఓ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలు ఈనెల 22, 23 తేదీల్లో జరగనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సంఘ నాయకులు కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నివాసం వద్ద శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో తూర్పు, కృష్ణా ఎపీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు ఉల్లి కృష్ణ, ఏవీ రావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.హిమ ప్రకాష్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కేపీ రావు, కైకలూరు, మండవల్లి తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను తెలియచేసేందుకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి. రాజేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలు కూడా ఇవ్వవచ్చన్నారు. 9959225464 ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా ఆయన కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వండి



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులు

గుడివాడ టౌన్: రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇండియా డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ పి. సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో లయన్స్ క్లబ్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ఒక సేవా కార్యక్రమం అన్నారు. లయన్స్‌క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని అందులో భాగంగా గుడివాడ శాఖ తీసుకున్న నిర్ణయం అభినందనీయం అన్నారు. 45 మంది రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ఏజీకే హైస్కూల్‌లలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కృష్ణకిషోర్, కార్యదర్శి యు. సతీష్, కోశాధికారి జి. వేణు, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, వైవీ కృష్ణారావు, ఎ. అప్పారావు, పి. సతీష్, కె. వెంకటేశ్వరరావు, దండమూడి సీతారామస్వామి, ఏకే చటర్జీ, పి. సాంబశివరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• హైస్కూల్‌కు ప్రింటర్ వితరణ

పెదపారుపూడి: మండలంలోని వానపాముల జెడ్పీ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థి ఏఎస్ నారాయణ రూ.20వేలు విలువ కలిగిన ప్రింటర్‌ను శుక్రవారం వితరణ అందజేశారు. హెచ్‌ఎం రాఘవేంద్రరావు మాట్లాడుతూ అంతే కాకుండా విద్యుత్ సరఫరా లేని సమయంలో తాగునీరుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పగా వెంటనే మరో రూ. 10వేలతో బోర్‌కు మరమ్మత్తులు చేయించారని చెప్పారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

• అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత

నిడుమోలు(మొవ్వ): మొవ్వ మండలం నిడుమోలు లాకు వద్ద ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహం కోల్పోయిన కూతాడి వీరస్వామి కుటుంబానికి మొవ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేయూతనందించింది. శుక్రవారం బాధిత కుటుంబానికి వంట, వడ్డన పాత్రలు, హైజెనిక్ కిట్స్‌తో పాటు 25కేజీల బియ్యంను మండల తహసీల్దార్, మండల రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల కమిటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

• వాహన లైసెన్సులు లేకుంటే కేసులు తప్పవు

కైకలూరు: వాహనదారులు ప్రతిఒక్కరూ నిబంధనలు మేరకు లైసెన్సులు కలిగి ఉండాలని కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు హెచ్చరించారు. పలు కూడళ్లలో శుక్రవారం 110 వాహనాల రికార్డులను శుక్రవారం తనిఖీ చేశారు. వీటిలో లైసెన్సులు, నిబంధనలు పాటించని 45 వాహనాలకు రూ.8 వేల జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ బస్సులు పూర్తి కండిషన్‌లో ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా బస్సు డ్రైవర్లు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలను అందిస్తే వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులతో వెళితే కేసులు తప్పవన్నారు.

• విద్యార్థులకు యోగాపై అవగాహన

మొవ్వ: యోగా అంటే అసాధ్యమైన భంగిమల్లో శరీరాన్ని తిప్పటం కాదని.. యోగా అనేది ఒక వ్యాయామ పద్ధతని యోగా గురూ ఎస్. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి అధ్యక్షతన భవనందు ధ్యాన యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా సాధనతో మనస్సు, శరీరం, ఆత్మను నియంత్రిచటంలో సహాయ పడుతుందని, శారీరక, మానసిక క్రమశిక్షణను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. మంజుల, సద్గుణ గురూజీ, నాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎల్‌వీ కృష్ణారావు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఎం. అనిల్ కుమార్ పాల్గొన్నారు.

• విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

పమిడిముక్కల: కృష్ణాపురం శివారు నారాయణపురం, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలలోని విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, స్టేషనరీ, ఆటవస్తువులు అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ కూచిభట్ల కిరణ్‌కుమార్, ప్రశాంతి దంపతులు శుక్రవారం వీటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఏటా పాఠశాలలకు నోటు పుస్తకాలు, ఆట వస్తువులు అందజేస్తున్న కిరణ్ దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

• ఓటరు సర్వేకు సహకరించండి

గుడివాడ టౌన్: స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్స్ చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి. మురళీ కృష్ణ కోరారు. శుక్రవారం పట్టణంలో బీఎల్ఓలు సర్వే నిర్వహిస్తున్న ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసేందుకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రత్యేకించి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకావడం, ఓటరు డోర్ నంబర్ స్పష్టంగా గుర్తించడం, పట్టణం విడిచి వెళ్లినా, మృతి చెందిన ఓటర్లను తొలగించడం అందుకు కావలసిన ఆధారాలను సేకరించాలన్నారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

• రైతుల సేవే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

పామర్రు: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తోందని రైతులు దీనిని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని పామర్రు-2 రైతు భారోసా కేంద్రం అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని ఆర్‌బీకే-2 పరిధిలోని గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం రైతులతో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులను ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అధిక వర్షాల వల్ల ముంపునకు గురైన వరి పొలాలలో నీరు తగ్గిన తర్వాత బూస్టర్ డోస్ వేయటం ద్వారా సాగుకు అనుకూలం చేసుకోవచ్చని అన్నారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, రైతులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, ఆర్‌బీకే వీఏఏలు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి సన్మానం



పామర్రు: గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు హాజీ అబ్దుల్లా(101)ను, ఆయన సతీమణిని మల్లంపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న మసీదు ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు లయన్ మల్లంపల్లి వెంకట్రావు ఇప్పటికీ అబ్దుల్లా తనకు కావాల్సిన సంపాదన తానే సంపాదించుకొని ఎవ్వరి మీద ఆధారపడకుండా జీవిస్తున్నారని అన్నారు. పవిత్ర ఖురాన్ ను అనేకమందికి బోధిస్తూ ఉన్నత జీవనం గడుపుతున్నారన్నారు. అబ్దుల్లా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు తొలగింపు

మండవల్లి: మండవల్లిలో హైవే నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక వెలమపేట రామాలయం ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుపై నీరు నిలిచింది. ఈఓపీఆర్డీ బి. ఆనందబాబు ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఇంజిన్లు పెట్టి శుక్రవారం నీరు తోడించారు. రోడ్డుపై బ్లీచింగ్, సున్నం చల్లించారు. దీంతో ప్రజల రాకపోకలకు రహదారి అనువుగా మారింది.